క్లుప్తంగా

21న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

బాలానగర్: తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మధ్యాహ్నం 2గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మంత్రి పరామర్శ



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రానికి చెందిన పలువురు వివిధ అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగులను శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆరోగ్య పరిస్థితులను బంధువులను అడిగి తెలుసుకున్నారు.

చిన్నవార్వాల్‌లో వైద్యశిబిరం

గండేడ్: మండలంలోని చిన్నవార్వాల్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరయ్యగౌడ్, బీఆర్ఎస్ మహమ్మదాబాద్ అధ్యక్షుడు భిక్షపతి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, ఎస్‌వీఎస్ డాక్టర్లు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



మహమ్మదాబాద్: టీఎస్‌పీఎస్సీలో చోటుచేసుకున్న పేపర్ లీకేజీకి నిరసనగా మండల కేంద్రంలో నిరాహార దీక్షకు బీజేవైఎం, బీజేపీ నాయకులు పిలుపునివ్వడంతో శనివారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న 30లక్షల మంది జీవితాలతో ప్రభుత్వం ఆటలాడడం సరికాదన్నారు. లీకేజీకి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కాశీనాథ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీను, ఉపాధ్యక్షుడు ఉమామహేష్, జయవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

శాసనమండలి చైర్మన్‌కు సన్మానం

నవాబుపేట: శాసనమండలి చైర్మన్ బండప్రకాష్‌ను మండల ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం హైదరాబాద్‌లో మండల ముదిరాజ్ మహాసభ నాయకులు సన్మానం చేసి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడిగా నవాబుపేటకు చెందిన రవీందర్‌ను ఏకగ్రీంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, ప్రతాప్, శివ, రవీందర్, మణి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

హన్వాడ: మండలంలోని గొండ్యాల్‌కు చెందిన ఓ మైనర్ బాలిక(16) శనివారం తప్పిపోయినట్లు ఎస్ఐ రవినాయక్ తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మయ్య అనే యువకుడిపై అనుమానంతో బాలిక కుటుంబీకులు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇరువర్గాలపై..

బాలానగర్: మండలంలోని హేమాజీపూర్‌కు చెందిన ఇరువర్గాలు భూ తగాదాల విషయంలో పెళ్లి కార్యక్రమంలో శుక్రవారం గొడవపడ్డారు. దీంతో శనివారం ఒక వర్గంపై మరో వర్గంపై పరస్పర ఫిర్యాదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయప్రసాద్ పేర్కొన్నారు.

ఒంటరి మహిళకు అండగా సఖి సెంటర్

పాలమూరు: భర్త మృతిచెందిన ఒంటరి మహిళకు సఖిసెంటర్ నిర్వాహకులు అండగా నిలిచారు. సఖి సెంటర్ కో–ఆర్డినేటర్ మంజుల తెలిపిన వివరాల ప్రకారం.. మిడ్జిల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన అమ్మాయికి, రాజాపూర్ మండల పరిధిలో ఓ గ్రామానికి చెందిన యువకుడికి పెళ్లయింది. కొన్ని రోజుల తర్వాత ఆమె పరీక్ష చేసుకుంటే హెచ్ఐవీ పాజిటివ్ అని తేలింది. దీంతో భార్యభర్తలు గతంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా, భర్త మృతిచెందగా ఆమె చికిత్స పొంది కోలుకుంది. తర్వాత భర్త తరుపు కుటుంబ సభ్యులు ఆమె భర్త డెత్ సర్టిఫికెట్‌తో పాటు పెళ్లి సందర్భంలో ఇచ్చిన బంగారు, వస్తువులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. బాధితురాలు సఖి సెంటర్‌ను ఆశ్రయించగా, పోలీసుల సహకారంతో శనివారం బాధితురాలికి మూడు తులాల బంగారం, వస్తువులు, డెత్ సర్టిఫికెట్ ఇప్పించినట్లు వెల్లడించారు.

స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుదాం



అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురులింగం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని, ఇందులో భాగంగా తడి, పొడి చెత్త వేరు చేసి ఇంటింటికీ వచ్చే మున్సిపల్ వాహనంలో వేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురులింగం పట్టణ ప్రజలకు సూచించారు. శనివారం బాలాజీనగర్ 11వ వార్డు పరిధిలోని భూలక్ష్మి ఎన్‌క్లేవ్‌లో నివసిస్తున్న ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడబడితే అక్కడ ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేయొద్దన్నారు. దీనివల్ల దోమలు, పందులు విజృంభించి మలేరియా, డెంగీ, విషజ్వరాలు సోకే ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అంతకుముందు సమీపంలోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ బాలికల స్కూల్‌లోనూ విద్యార్థులకు ఇవే అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్‌డీఎఫ్‌సీ, రాంకీ ప్రతినిధులు, వేస్ట్ మేనేజ్‌మెంట్ బృందం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి ప్రాధాన్యం



కోడూరులో మాట్లాడుతున్న మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కోడూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తుందని తెలిపారు. పిల్లలను ప్రతిరోజూ బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. సమావేశంలో హెచ్ఎం రమేష్‌గౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ సురేష్ పాల్గొన్నారు.

అడ్డాకుల: విద్యార్థులపై తల్లిదండ్రులు తగిన శ్రద్ధ వహించాలని హెచ్ఎం లక్ష్మణ్‌గౌడ్ సూచించారు. మూసాపేట మండలం తుంకినీపూర్ పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి వద్ద పిల్లల చదువులపై తల్లిదండ్రులు ఆరా తీసి అవసరమైతే తమ దృష్టికి తెస్తే పిల్లలు చదువుల్లో రాణించేలా మరింత కృషి చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా గురుకుల పోటీ పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, ఉప సర్పంచ్ శేఖర్, ఎస్ఎంసీ చైర్మన్ రాములు, వైస్ చైర్మన్ సుజాత, ఉపాధ్యాయుడు కుర్మయ్య తదితరులు ఉన్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

జడ్చర్ల టౌన్: పరీక్షలంటే భయం వీడాలని పదో తరగతి విద్యార్థులకు ఎంఈఓ మంజులాదేవి సూచించారు. శనివారం మండలంలోని పోలేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇళ్ల వద్ద విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. పరీక్షలు మరో పదిరోజులే ఉన్నందునా శ్రద్ధతో చదవాలని విద్యార్థులకు తెలిపారు. సమావేశంలో హెచ్ఎం నాగేంద్రమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

గండేడ్: మండలంలోని వెన్నచేడ్ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. డీఈఓగా నందిని, హెచ్ఎంగా అమేషసిద్ధిఖి, ఎంఈఓగా సోఫియాలు వ్యవహరించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటప్రసాద్, చెన్నయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

హన్వాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉందని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మునిమోక్షంలో వ్యవసాయ కూలీల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో అనేక రూపాల్లో రైతుల తరపున నిరసనలు వ్యక్తం చేస్తూ, గ్రామసభలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు, అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పిస్తూ, పేద, మధ్య తరగతి వర్గాలకు కేంద్ర ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్లను, 2022 చట్టాన్ని విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈజీఎస్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ పనికల్పిస్తూ కనీస వేతనం రూ.600లకు తగ్గకుండా ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రాములు, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

మిడ్జిల్: కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షకులను మోసం చేస్తూ కార్పొరేట్ శక్తులైన ఆదానీ, అంబానీ ఇతరులకు దోచిపెడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు రాములు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తెలుగు సత్తయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీన చలో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 26న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి జన చైతన్యయాత్ర వస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జగన్, యాదయ్య, మోహన్‌రెడ్డి, బాలయ్య, జంగయ్య, ఊషయ్య పాల్గొన్నారు.

వైభవంగా రాజస్తానీ గంగోర్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం క్లాక్‌టవర్ చౌరస్తాలోని రాజస్తాన్ సమాజ్ భవనంలో శనివారం రాజస్తానీ మహిళా మండలి ఆధ్వర్యంలో గంగోర్ సాంస్కృతిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు రోజుల నుంచి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేపడుతున్నారు. అదేవిధంగా గోరింటాకు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు కిరణ్ గుప్త, కార్యదర్శి సునీత రాఠి, జమున హర్‌కుట్, సూరజ్‌కాంత్ దూత్, లీల తపాడియా తదితరులు పాల్గొన్నారు.



గంగోర్‌లో పాల్గొన్న మహిళలు

ఆధ్యాత్మికమార్గంతోనే సమాజంలో శాంతి



పీఠాధిపతులతో శివకుమార్, విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం సభ్యులు

జడ్చర్ల టౌన్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయణించటం వల్ల సమాజంలో శాంతి నెలకొంటుందని కాలజ్ఞాన సృష్టికర్త వీరబ్రహ్మేంద్రస్వామి మునిమనవడు వీరంబొట్లయ్య స్వామి అభిప్రాయపడ్డారు. శనివారం బ్రహ్మంగారి మఠం నుంచి కర్నూలు షణ్ముఖ ఆశ్రమ పీఠాధిపతి కృష్ణస్వామితో కలిసి హైదరాబాద్ వెళ్తూ మార్గ మధ్యలో పట్టణంలోని బాద్మి శివకుమార్, రవిశంకర్‌ల గృహంలో కొద్దిసేపు ఆగారు. పట్టణానికి వచ్చిన ఆయనకు స్థానిక విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం సభ్యులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు శేఖరాచారి, రవీంద్రచారి, ప్రభాకరాచారి, విఠలయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

మహబూబ్‌నగర్ రూరల్: ప్రతి మూడునెలలకోసారి ప్రజా సమస్యలపై చర్చించేందుకు ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ సుధాశ్రీ తెలిపారు. తదుపరి సమావేశ తేదీని త్వరలోనే అధికారులు ప్రకటిస్తారని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మిడ్జిల్: మండలంలోని వల్లభ్‌రావుపల్లికి చెందిన షాబాద్ వెంకటయ్య అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందగా, స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణ సాయంగా రూ.10వేలు అందించారు.

మండల అధ్యక్షుడిగా బాలయ్య

బాలానగర్: ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడిగా గుడిసెల బాలయ్యను హైదరాబాద్‌లోని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ నియమించారు. ఈ మేరకు నియామక పత్రం అందజేశారు.

రామలింగేశ్వరాలయంలో అన్నదానం

అడ్డాకుల: మండలంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జాతరను పురస్కరించుకుని భక్తులకు శనివారం ఎస్ఐ విజయకుమార్ అన్నదానం చేశారు. ఆలయ సమీపంలోని కల్యాణ మండపంలో భక్తులకు భోజనాలు సిద్ధం చేయించి అక్కడే భోజనాలను వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

భూత్పూర్: మండలంలోని కొప్పెట వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. కొప్పెటలో వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్ పట్టుకొని అనుమతి పత్రాలు అడుగగా లేకపోవడంతో పోలీస్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమానులు మసూద్ పాష, బోయ నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లేబర్ కార్డును సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న గోపినాథ్

దేవరకద్ర: కార్మికులకు ప్రభుత్వం అందజేస్తున్న లేబర్‌కార్డును సద్వినియోగం చేసుకోవాలని జన్ సాహస సంస్థ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ గోపినాథ్ తెలిపారు. శనివారం మండలంలోని నార్లోనికుంట్లలో పంచాయతీ కార్యాలయం వద్ద లేబర్‌కార్డుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ లేబర్‌కార్డు ఉన్న కార్మికులు సహజంగా మృతిచెందితే రూ.లక్షా 30వేలు, ఆడపిల్ల పెళ్లికి రూ.30వేలు, కాన్పులకు రూ.30వేలు అందజేస్తారని తెలిపారు. ఈ శ్రామ్ కార్డు అసంఘటిత రంగంలోని కార్మికుల కోసం సామాజిక భద్రత పథకాల ప్రయోజనాలను పెంచేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, ప్రతినిధులు అంజద్ హుస్సేన్, లక్ష్మీకాంత్, రాజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు మార్నింగ్ వాక్ ద్వారా వార్డులో పర్యటిస్తున్నట్లు 15వ వార్డు కౌన్సిలర్ లతశ్రీ తెలిపారు. శనివారం గ్రామంలోని గౌడ్స్ కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ పాలనలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, యాదయ్య, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ బస్సులు బస్టాండ్‌లోకి రావాలి

అడ్డాకుల: మండల కేంద్రంలోని బస్టాండ్‌కు అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చి వెళ్లేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. హైదరాబాద్, కర్నూల్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి రాకుండా హైవే మీద నుంచే వెళ్లిపోతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్, కర్నూల్‌కు వెళ్లే ప్రయాణికులు ఎక్కువగా ప్రైవేటు వాహనాలపై ఆధారపడుతున్నారు. గతంలో సర్వీస్ రోడ్లు బాగోలేవన్న కారణంతో కొన్ని బస్సులు హైవే మీదుగా వెళ్లేవి. ఇప్పుడు హైవేకు రెండు వైపులా ఉన్న సర్వీస్ రోడ్లపై బీటీ వేయడంతో బస్టాండ్‌లోకి బస్సులు రావడానికి ఎలాంటి ఇబ్బందులు కలుగడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు అడ్డాకుల బస్టాండ్‌లోకి వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

యూసీఆర్‌బీ బిల్లును ఆమోదించాలి



పాలమూరు యూనివర్సిటీలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: యూనివర్సిటీల కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు (యూసీఆర్‌బీ) బిల్లును వెంటనే ఆమోదించాలని బీఆర్ఎస్‌వీ విభాగం పీయూ ఇన్‌చార్జ్ కురువ పల్లయ్య డిమాండ్ చేశారు. బిల్లును రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తాత్సారం చేస్తున్నారంటూ సంఘం ఆధ్వర్యంలో శనివారం పీయూలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూసీఆర్‌బీ ద్వారా చాలా మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. ఇలాంటి బిల్లును గవర్నర్ ఆపేయడం దురదృష్టకరమన్నారు. ఫారెస్ట్ విశ్వవిద్యాలయ అక్రెడియేషన్‌కూ మోకాలడ్డుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ పీయూ కన్వీనర్ భరత్, సంఘం నాయకులు రమేష్, ప్రకాష్, తిరుపతి, చందు, మధు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో టెంకాయల వేలం



టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నవాబుపేట: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మైసమ్మ ఆలయంలో టెంకాయల విక్రయానికి సంబంధించి శనివారం టెండర్లు ఖరారు చేసినట్లు ఆలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాకర్లపహాడ్‌కు చెందిన సంజీవరెడ్డి రూ.25లక్షల 5వేలకు టెంకాయల విక్రయం, రూ.8లక్షల 86వేలకు వాహన పూజ సామగ్రి విక్రయానికి సంబంధించిన టెండర్లు దక్కించుకున్నారు. అలాగే ఊషన్న రూ.5లక్షల 60వేలకు పూల విక్రయం టెండర్లు దక్కించుకున్నాడు. గతంలో రూ.29లక్షలు టెండర్ల ద్వారా ఆదాయం రాగా, ప్రస్తుతం రూ.41లక్షల ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్య, సంజీవ్, మాదవులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న నాయకులు

బాలానగర్: మండలంలోని ఊటకుంటతండాలో శనివారం ఆంజనేయ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారం వైభవంగా నిర్వహించారు. గ్రామపెద్దలు ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దింది. ధ్వజస్తంభ కార్యక్రమానికి డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అభిమన్యురెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లింగునాయక్, యాదయ్య, సంజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో జైనల్లీపూర్ భజన మండలి సభ్యులు



భజనల కార్యక్రమంలో పాల్గొన్న భజన మండలి సభ్యులు

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని జైనల్లీపూర్ (అయ్యవారిపల్లి) గ్రామ భజన మండలి సభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానంలో భజన చేసేందుకు అపూర్వ అవకాశం లభించింది. కార్యక్రమంలో భజన బృందం పంతులు రాజు, గంజి ఆంజనేయులు, సున్నల గోవర్దన్, శ్రీనివాసులు, ఎల్పటి మన్యం, బియ్యన్ని యాదయ్య, ఎల్పటి నర్సిములు, సీతారాం, బాబునాయక్, ఎల్పటి బాలరాజు, తాటికొండ రాజు, గొడుగు యాదయ్య, కిరాణం యాదయ్య, డి.రాజు పాల్గొన్నారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సెర్ప్‌లో పనిచేస్తున్న వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి అన్నారు. వీఓఏల సమస్యలు పరిష్కరించాలని వీఓఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుముందు ధర్నా చౌక్ నుంచి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు ఏర్పాటు చేసి మహిళలను ఆర్థికంగా ఎదుగుదలకు కృషి చేస్తారన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. రూ.10లక్షల సాధారణ ఉద్యోగ భీమా పథకం అమలు చేయాలని తెలిపారు. ఆన్‌లైన్ పనులు రద్దు చేయాలన్నారు. ఐకేపీ, వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు మంజుల, భీమయ్య, పాస్యా బేగం మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చంద్రకాంత్ పాల్గొన్నారు.